క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మహిళలకు యోగాపై శిక్షణ ఇస్తున్న గురువు డాక్టర్ శ్రీనివాస్

అమలాపురం టౌన్: మహిళల్లో ఎదురయ్యే పలు రుగ్మతలకు యోగా వల్ల పరిష్కార మార్గం లభించడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని అమలాపురం స్వామి వివేకానంద యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ అన్నారు. స్థానిక జీవీ మాల్ మహిళా సిబ్బందికి సోమవారం ఉదయం నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు యోగాతో పాటు సరైన ఆహార నియమాలు పాటిస్తే బీపీ, షుగర్, గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు వంటి అన్ని రుగ్మతల నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు.

యువతకు క్రీడా కిట్ల పంపిణీ



యువతకు క్రీడా కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధి 4వ వార్డు ఇన్‌చార్జ్ కాకి మాణిక్యం ఆధ్వర్యంలో బేడ, బుడగ జంగాల యువతకు క్రీడా కిట్లను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు దొమ్మేటి రమణకుమార్, దాట్ల పృథ్వీరాజ్, ఉప్పు సుబ్బారావు, కల్యాణం మావుళ్లు, కల్యాణం విజయ్, చెన్నూరి మరిడియా, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా సీఆర్ఎంటీ జిల్లా అధ్యక్షుడిగా నామాడి



నామాడి వెంకటరావు

అల్లవరం: సమగ్ర శిక్షా సీఆర్ఎంటీ జిల్లా అధ్యక్షుడిగా అల్లవరం మండలానికి చెందిన నామాడి వెంకటరావు ఎన్నికయ్యారు. అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన సీఆర్ఎంటీ జిల్లా స్థాయి సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా రవికుమార్(కాట్రేనికోన), అనూష(అమలాపురం) ఉపాధ్యక్షులుగా కేపీ రాములు(రాయవరం), బి.కిషోర్(సఖినేటిపల్లి), కోశాధికారిగా ఎం.అర్జున్(పి.గన్నవరం), కన్వీనర్‌గా ఎ.రాజేంద్ర(ఆత్రేయపురం), కో కన్వీనర్‌గా నీలాంబరం(ఐ.పోలవరం), సంయుక్త కార్యదర్శిగా జి.నాగన్న(అమలాపురం), భరోసా కన్వీనర్లుగా నాగభూషణం, ఎం.చంద్రరావులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్‌చార్జీల పెంపుపై వ్యతిరేకత

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులపై చార్జీల భారం మోపుతూ విద్యుత్ రెగ్యులేటరీ అథారిటీ తీసుకున్న నిర్ణయంపై సామాన్య ప్రజలు మొదలు వ్యాపారవర్గాల వరకూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ మేరకు సోమవారం పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇకపై నెలవారీ గృహాలు తదితర విభాగాల విద్యుత్ వాడకం బిల్లుతో పాటు అదనంగా సర్‌చార్జి, పర్మినెంట్ సర్వీస్ చార్జి, ఆలస్య రుసుము, సర్వీసు చార్జిను సైతం వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారు. ఆ విధంగా నెలవారీ కిలోవాట్‌కు రూ.30 నుంచి రూ.35 అదనపు భారం పడుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పరిశ్రమలకు పర్మినెంట్ సర్వీసు చార్జీలుగా కిలోవాట్‌కు రూ.75 నుంచి రూ.200 ఫిక్స్‌డ్ చార్జీలను, హైటెట్జీకి రూ.420 వరకూ వసూలు చేయనున్నారు. 11 కేవీ, 22 కేవీ, 33 కేవీ, హెచ్‌టీ ప్లాంట్లకు, ఈహెచ్‌డీ ఫ్యాక్టరీలకు చార్జీలు పెంచారు. ఇలా విద్యుత్ చార్జీలు పెంచేస్తే తాము పరిశ్రమలు మూసుకోవాల్సిందేనని పలు పరిశ్రమల యాజమాన్యాలు చెబుతున్నాయి.

బెల్టుషాపుపై పోలీసుల దాడి

కాట్రేనికోన: మండలంలోని బలుసుతిప్పలో అనధికారికంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్న బెల్టు షాపుపై పోలీసులు సోమవారం దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి 3 కేసుల నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

బాలకార్మిక వ్యవస్థపై అవగాహన

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామంలో అనూస్ స్వచ్ఛంద సంస్థ విద్యాబ్యాంక్ ఆధ్వర్యంలో ప్రభుత్వం నేను బడికి పోతాం కార్యక్రమంలో భాగంగా బాల కార్మిక వ్యవస్థపై పేద చిన్నారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ ఇంద్రజాలికుడు, ఉపాధ్యాయుడు చింతా శ్యామకుమార్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన అన్నపూర్ణ శేఖర్, వైజాగ్‌కు చెందిన మచ్చ నిరంజనకుమార్ సమకూర్చిన విద్యా సామగ్రి పేద చిన్నారులకు పంపిణీ చేశారు. వలస కూలీ చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అనూస్ సంస్థ అధ్యక్షురాలు అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

భూమి సేకరించారు.. పట్టాలివ్వలేదు

- 17 ఏళ్ల క్రితం పేదల ఇళ్ల పట్టాల పంపిణీకి 6.5 ఎకరాల సేకరణ
- నాటి నుంచి నిరుపయోగంగా వదిలేసిన అధికారులు

యానాం: ఇది 17 ఏళ్ల క్రితం నాటి యానాం ఇళ్ల పట్టాల గాథ.. ఎన్నికల వేళ నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ హామీలిచ్చారు. ఆనందంగా పేదలంతా దరఖాస్తులు చేసుకున్నారు. వందల మందికి పట్టాలిస్తామంటూ 6.5 ఎకరాల భూమిని సైతం సేకరించారు. ఇక అంతే.. అక్కడి నుంచి అడుగు ముందుకు పడితే ఒట్టు.. ఇన్నేళ్లలో ఎందరో నాయకులు మారారు.. ఇంకెందరో అధికారులు వచ్చి పోయారు. కాని పట్టాలు మాత్రం పంపిణీ చేయలేదు. కనీసం కారణమేంటో చెప్పే దిక్కు కూడా లేదు. ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి తల పండిపోయిందే తప్ప పట్టా మాత్రం దక్కలేదు.

యానాం నియోజకవర్గంలో 60 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఇక్కడ ప్రజాప్రతినిధులకు అందే దరఖాస్తుల్లో ఎక్కువ భాగం నివేశన స్థలాల కోసమే వస్తుంటాయి. ప్రస్తుతం ఇళ్ల పట్టాల కోసం 951 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అనధికారికంగా చెత్త బుట్టలోకి చేరిపోయిన దరఖాస్తులైతే వేలల్లో ఉంటాయని ప్రభుత్వ కార్యాలయ వర్గాల్లోనే చర్చ సాగుతుంది. యానాం నియోజకవర్గ వైశాల్యం రీత్యా భూమి లభ్యత చాలా తక్కువ. పైగా



అడివిపాలెం కురసాంపేట రెవెన్యూ విలేజ్‌లో పేదల కోసం సేకరించిన భూమి



ఎంపీ వైథిలింగానికి వినతి పత్రం అందించిన మెల్లం శ్రీనివాసరావు

ప్రభుత్వ భూములు సైతం లేకపోవడంతో నివేశనా స్థలాల పట్టాల పంపిణీ జరగడం లేదు. అందుకే ఎన్నో పేద కుటుంబాలు అద్దె గృహాల్లో నివసిస్తున్నాయి. కొందరైతే ఒకే ఇంటిలో అన్నదమ్ముల కుటుంబాలు సైతం ఉంటూ సర్దుబాటు చేసుకుంటున్నారు. నివేశనాస్థల పట్టాల పంపిణీకి భూమిని సేకరించినప్పటికి దానికి సంబంధించి సేకరించి సుమారు 17 ఏళ్లు గడుస్తున్నా ఈ సమస్యగూర్చి పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2001లో భూసేకరణకు సమావేశం

పేదలకు నివేశనా స్థలాల పంపిణీకి 2001 నవంబర్ 2న రీజినల్ అడ్మినిస్ట్రేటర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భూసేకరణ కమిటీలో చైర్మన్, మెంబర్ సెక్రటరీ హోదాలో ఆర్‌ఓ, సభ్యులుగా పీడబ్ల్యూడీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జూనియర్ టౌన్‌ప్లానర్, డిప్యూటీ డైరెక్టర్(హెల్త్), మున్సిపల్ కమిషనర్ తదితరుల ఆధ్వర్యంలో కురసాంపేట అడివిపాలెం రెవెన్యూ విలేజ్‌లో సుభద్రనగర్‌ను చేర్చి ఉన్న 6.5 ఎకరాల దేవదాయశాఖ భూమి సేకరణకు అధికారులు ఆమోదం తెలిపారు. అనంతరం సదరు భూమి పట్టాలిచ్చేందుకు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాదు సదరు భూమికి సంబంధించి ప్రభుత్వం నుంచి దేవదాయశాఖకు రూ.3 కోట్ల పరిహారం అందించారు. అయితే తదుపరి ప్రక్రియ ముందుకు వెళ్లకపోవడంతో పాటు అటు అధికారులు, ఇటు నాయకులు పట్టించుకోకపోవడంతో ఇళ్ల పట్టాల పంపిణీ నిలిచిపోయింది. ఇవ్వడానికి భూమున్నా పేదలకు ఇవ్వకుండా ఇన్నేళ్లు తాత్సారం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఎవరూ బదులిచ్చేందుకు ముందుకు రాలేదు.

ఎంపీ వైథిలింగానికి వినతి

భూమిని సేకరించి 17 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకూ పట్టాలివ్వలేదంటూ ఎంపీ వైథిలింగంకు విడుతలై చిరుతైగల్ కచ్చి పార్టీ యానాం శాఖ కార్యదర్శి మెల్లం శ్రీనివాసరావు ఇటీవలే వినతిపత్రం అందజేశారు. సేకరించిన భూమిని అలాగే వదిలేయడంతో ఆక్రమణదారులు పాగా వేస్తున్నారని, ఇప్పటికైనా స్థలాన్ని స్వాధీనం చేసుకుని పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. ముఖ్యంగా నియోజకవర్గ పరిధిలోని కాలువ గట్లు, రహదారికి ఇరువైపులా నివసిస్తున్న పేదలకు నివేశనా స్థలాలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే ఆనందరావుకు సత్కారం

అమలాపురం టౌన్: ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును ది అసోసియేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఘనంగా సత్కరించి అభినందించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సత్కార కార్యక్రమంలో చాంబర్ కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు, చాంబర్ ప్రతనిధులు ఆర్వీ నాయుడు, సప్పా నాగేశ్వరరావు, కుప్పాల రామకృష్ణ, సంగినీడి బాబు, అడపా వెంకటేశ్వరరావు, రమణాతి రవి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆనందరావును సత్కరిస్తున్న వ్యాపార ప్రతినిధులు

ఉద్యమాలతోనే కార్మిక హక్కుల సాధన

అమలాపురం టౌన్: ఉద్యమాలు, పోరాటాలతోనే కార్మిక హక్కుల సాధన సాధ్యమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంప్లాయిస్ హౌస్‌లో సోమవారం జరిగిన సీఐటీయూ జిల్లా మహాసభకు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన జిల్లా మహాసభలో పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూకి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా గుదే దుర్గా ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నూకల బలరామ్, కోశాధికారిగా కె.కృష్ణవేణి, ఉపాధ్యక్షులుగా ఎం.భాస్కరరావు, బండి లక్ష్మి, కార్యదర్శులుగా సత్యనారాయణ, మలక సుభాషిణిలను ఎన్నుకున్నారు. అనంతరం స్థానిక మున్సిపల్ కాలనీ వెనుక ఉన్న సీఐటీయూ నూతన జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. నూతన కార్యాలయం నుంచి ఎంప్లాయిస్ హోమ్ వరకూ ఎర్ర జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. మహాసభలో రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ, జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, సుందరబాబు, ఎం.రమణ, కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా సీఐటీయూ మహాసభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

ప్రజలు బీజేపీ, ఎన్ఆర్ కూటమిని తిరస్కరించారు

యానాం: పుదుచ్చేరిలో బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించారని, ఇటీవల జరిగిన లోక్‌సభ స్థాన ఎన్నికల్లో కూటమి ఘోర ఓటమే దానికి నిదర్శనమని యానాం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పుదుచ్చేరి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన హోంమంత్రి నమశ్శివాయంపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 1,36,000 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారన్నారు. యానాంలో సైతం 6,947 ఓట్ల మెజార్టీ రావడం స్థానిక ప్రజల ఆదరణను తెలుపుతుందన్నారు. యానాం నియోజకవర్గ ప్రజాసమస్యలపై కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలబడి పోరాడుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస వైద్యం అందడం లేదని, ఆఖరికి మార్చురీలో మృతదేహాలు భద్రపరిచేందుకు ఫ్రీజర్ బాక్స్ సైతం లేని పరిస్థితి నెలకొందన్నారు. జిప్‌మెర్‌కు వచ్చే రోగులను రక్తపరీక్షలకు సైతం బయట ల్యాబ్‌లకు పంపిస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే అశోక్, పుదుచ్చేరి ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సైతం పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో పైడికొండల రాజబాబు, శ్రీమంతుల శ్రీధర్, జాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యానాం కాంగ్రెస్ నేతలు

సీబీఐ విచారణకు ఆదేశించాలి

యానాం: పుదుచ్చేరిలో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ కూటమికి చెందిన ఓ మంత్రి కుమారై అద్దెకు తీసుకున్న స్థలంలో నడుస్తున్న గంధపు చెక్కల నుంచి నూనె తీసే పరిశ్రమపై సీబీఐ విచారణకు ఆదేశించాలని మాజీ సీఎం నారాయణసామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉలైవక్కల్‌లోని సదరు సువాసన గల నూనెలు తయారు చేసే ప్లాంటులో అనేక బస్తాల గంధపు చెక్కలు బయటపడ్డాయన్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ సంస్థలకు మాత్రమే గంధం విక్రయించేందుకు అనుమతి ఉందన్నారు. పక్కాగా నిబంధనలు ఉన్నప్పుడు అంత మొత్తంలో గంధపు చెక్కలను ఎలా రవాణా చేశారని ఆయన ప్రశ్నించారు. స్థల యజమాని సదరు మంత్రి కుమార్తెకు అద్దెకు ఇచ్చిన ఉద్దేశాన్ని బహిర్గతం చేయాలన్నారు.

కార్యవర్గ సభ్యులకు అభినందన

కాట్రేనికోన: జిల్లా సమగ్ర శిక్ష విద్యాశాఖ సీఆర్ఎంపీటీల కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన పి.రవికుమార్, కొప్పిశెట్టి నాగభూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రవికుమార్, కన్వీనర్ కొప్పిశెట్టి నాగభూణంలను ఎంఈఓలు కె.సుబ్రమణ్యం, ఎం.వెంకటరమణలు సోమవారం అభినందించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

మసీదుల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

అమలాపురం టౌన్: రంజాన్ తర్వాత బక్రీద్ పండగను ముస్లింలు సోమవారం అత్యంత పవిత్రంగా జరుపుకున్నారు. పట్టణంలోని ముల్లా ముస్తాఫా, జామియా మసీదుల్లో ముస్లింలు పవిత్ర ప్రార్థనలు చేశారు. ముస్లింలంతా సోదర భావంతో ఆత్మీయంగా ఆలింగనాలు చేసుకుని ఈద్ ముబారక్‌లు చెప్పుకున్నారు. ముల్లా ముస్తాఫా మసీదులో ఇమామ్ మొహ్మద్ రాజా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగాలకు ప్రతీకగా బక్రీద్ పండుగ ముస్లింలు జరుపుకుంటారని పేర్కొన్నారు. అనంతరం బక్రీద్ పర్వదినం సందర్భంగా ఉదయం 8.30 గంటలకు మసీదుల్లో వందలాది మంది ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, పట్టణ ముస్లిం పెద్దలు ఎండీ అమీర్, ఎండీ ఆజామ్, మొహిద్దీన్, వలీ, జీఎం ఖాన్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: నియోజకవర్గంలో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో బక్రీద్ జరుపుకున్నారు. ఉదయం ప్రత్యేక నమాజులను చేసి ఈద్ సారాంశాన్ని మౌలానాలు ముస్లిం సోదరులకు వివరించారు. ముమ్మిడివరం గొల్లగూడెం వద్ద ఉన్న షియా మస్జిద్ మౌలానా మొహమ్మద్ తఖీ మాట్లాడుతూ పేదలు, నిస్సహాయ స్థితిలో ఉన్నవారిని ఆదుకోవడం ఇస్లాం ధర్మం అని దాన్ని దృష్టిలో పెట్టుకుని సమాజంలో ప్రతిఒక్కరూ దయాగుణంతో మెలగాలన్నారు. సున్ని జామియా మసీదు, ఐ.పోలవరం , చెయ్యేరు, కాట్రేనికోన, అనాతవరం, వద్ద ఉన్న మసీదుల్లో ముస్లిం భక్తులు బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు.

యానాం: నియోజకవర్గ పరిధిలో ముస్లింలు సోమవారం బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జామియా మసీదుతో పాటు వెంకటనగర్‌లో మసీదే కూబాలో సైతం ఉదయం నుంచి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమామ్‌లు ఎండీ యర్ధాని, ఎంఏ రఫీ మాట్లాడుతూ త్యాగానికి, సత్యానికి ప్రతీక బక్రీద్ పర్వదినమని మహ్మద్ ప్రవక్త బోధించిన సమైఖ్యత, సహోదర భావాలను అందరూ అలవర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జామియా మసీదు కార్యవర్గ అధ్యక్షుడు ఎస్‌కేఎం జిలానీ, ఎండీ కరీమ్, కార్యదర్శి రిజ్వాన్, సహాయ కార్యదర్శి ఎండీ గౌస్ మొహిద్దీన్, క్యాషియర్ జిలాని పాల్గొన్నారు.



అమలాపురం ముల్లా ముస్తాఫా మసీదులో బక్రీద్ ప్రార్థనలు



బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటున్న ముస్లింలు

ఘనంగా గజమాల యాత్ర



మామిడికుదురు సెంటర్‌లో గజమాల యాత్ర

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి కల్యాణం సందర్భంగా దేవస్థానం వ్యవస్థాపకుడు మొల్లేటి రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల మెడలో ఆవిష్కరించే గజమాల యాత్ర ఊరేగింపు సోమవారం ఘనంగా జరిగింది. రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజోలు మండలం తాటిపాక శెట్టిబలిజ సంఘం భవనం నుంచి కేరళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు నడుమ ప్రారంభమైన యాత్ర మామిడికుదురు బస్టాండ్ కూడలి మీదుగా అప్పనల్లి వరకు సాగింది. అప్పనపల్లి ఆలయం ప్రాంగణంలో ఉన్న రామస్వామి దంపతుల విగ్రహాలకు గజమాలను అలంకరించారు. శెట్టిబలిజ సంఘం యువత మోటార్ సైకిళ్లపై ర్యాలీగా ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గజమాల యాత్రలో పాల్గొన్నారు. యాత్రలో మండల శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్, సంఘం ప్రతినిధులు వాసంశెట్టి శంకరరావు, జోగి వెంకటరామకృష్ణ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

మామిడికుదురు: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి చిత్తశుద్ధితో అమలు చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కోరారు. బక్రీద్ సందర్భంగా మామిడికుదురులో సోమవారం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మత గురువు మహ్మద్ ఇబ్రహీంను సన్మానించారు. మామిడికుదురులో గ్రీవెన్స్ సెల్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టం తమ పరిధిలోనిది కాదన్నారు. కూటమి తప్పుడు ప్రచారం నమ్మి ప్రజలు కూటమిని ఆదరించారని చెప్పారు. వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు చేయడం దారుణమన్నారు. దీనిపై అధికారులు తక్షణం స్పందించాలని సూర్యారావు డిమాండ్ చేశారు. ఎవరికి ఏ కష్టం వచ్చిన వారికి పార్టీ అండగా నిలబడుతుందని గొల్లపల్లి హామీ ఇచ్చారు. పార్టీ శ్రేణులు డీలా పడే పరిస్థితి లేదన్నారు.



మామిడికుదురులో మత గురువు ఇబ్రహీంను సత్కరిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన వేణుగోపాలస్వామి, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి ఆలయాల్లో సోమవారం సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవాలు కనులపండువగా నిర్వహించారు. ఉదయం ఆలయ ఈఓలు భూపతిరాజు కిషోర్‌కుమార్, బి.కృష్ణచైతన్య ఆధ్వర్యంలో స్వామి వార్ని అర్చకులు ప్రత్యేక పువ్వులతో అలంకరించారు. అనంతరం వివిధ పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణోత్సవాలు తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. వేంకటేశ్వరస్వామి 36వ వార్షిక కల్యాణం పురస్కరించుకుని తొలుత స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆలయ ప్రధాన అర్చకులు విజయకుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య దేవతామూర్తుల విగ్రహాలకు వేద పండితులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. గ్రామానికి చెందిన గుణ్ణం త్రిసోను, శ్రీసంయుక్త దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా రామలింగేశ్వర స్వామి దివ్య కల్యాణం



రామలింగేశ్వర స్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీకామాక్షి పీఠం మహాసంస్థానంలో కొలువైన కామాక్షీ సమేత రామలింగేశ్వర స్వామివారి దివ్య కల్యాణం సోమవారం ఉదయం 8.46 గంటలకు వైభవంగా జరిగింది. పీఠాధిపతి కామేశ మహర్షి సమక్షంలో పండితులు స్వామివారి కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ పూజ్యం నాగేశ్వరశర్మ యాజ్ఞీకంలో రుత్విక్కులు కల్యాణ ఘట్టాన్ని కన్నుల పండువగా జరిపారు. కామాక్షీ దేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని తరించారు.

ఎమ్మెల్యే అభినందన



నర్సింహరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిరాజు

ఐ.పోలవరం: ఇటీవల డాక్టరేట్ అందుకున్న జగతా వీఎల్ నరసింహరావును ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు అభినందించారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన నరసింహరావును ఎమ్మెల్యే సత్కరించారు. అంతర్జాతీయ అవార్డు సాధించడమే కాకుండా ఆంగ్ల బోధనలో మూడు ప్రపంచ రికార్డులు సాధించి కోనసీమకు గర్వకారణంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో గోకవరపు వెంకటరాజు, భద్రి పాల్గొన్నారు.

కుక్కుటేశ్వరరావుకు ఘన నివాళి



కుక్కుటేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉప్పలగుప్తం: మాజీ డీసీసీబీ చైర్మన్ శిరంగు కుక్కుటేశ్వరరావు మూడో వర్ధంతిని ఆయన స్వగ్రామం భీమనపల్లిలో సోమవారం నిర్వహించారు. కొల్లపల్లి భగవాన్ ఆధ్వర్యంలో భట్నపాలెం ప్రధాన కూడలిలో ఏర్పాటుచేసిన కుక్కుటేశ్వరరావు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్, హార్టీకల్చర్ బోర్డు సభ్యులు జున్నూరి వెంకటేశ్వరరావు, నల్లా విష్ణుమూర్తి, సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, మాజీ ఎంపీపీ శిరంగు రాజా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ



భూషణం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాలమూరి మోహన్

ఉప్పలగుప్తం: ఇటీవల కృష్ణా జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం గ్రామానికి చెందిన రేవు భూషణం కుటుంబాన్ని అమలాపురం బీఎస్పీ ఇన్‌చార్జ్ పాలమూరి మోహన్‌బాబు సోమవారం పరామర్శించారు. భూషణం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఎస్పీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోలా త్రిమూర్తులు, ముత్తాబత్తుల శ్రీనివాస్, కొంకి ప్రకాశరావు, వెర్రి బ్బాయి, పి.రాంబాబు తదితరులున్నారు.

95 మద్యం బాటిళ్ల పట్టివేత

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి పంచాయతీ పరిధి ఎన్టీఆర్ కాలనీలో ఈతకోట పల్లంరాజు ఇంట్లో అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ కె.మనోహర్ జోషి సోమవారం రాత్రి తెలిపారు. అతడి వద్ద నుంచి 95 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మనోహర్‌జోషి తెలిపారు.

లోక కల్యాణార్థం లలిత పారాయణ

ఐ.పోలవరం: లోక కల్యాణార్థం ఏకాదశి మహాపర్వదినంను పురస్కరించుకుని తమిళనాడు రాష్ట్రం తిరుమాచ్చురులో కొలువైన లలిత అమ్మవారి సన్నిధిలో లలిత భక్తమండలి యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక మహిళలు 12 గంటల పాటు లలిత సహస్ర నామ పారాయణ నిర్వహించారు.

యానిమేటర్లపై చర్యలకు సిఫార్సు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో నిబంధనలు అతిక్రమించి నిధుల దుర్వినియోగం ఆరోపణలు ఎదుర్కొంటున్న యానిమేటర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా డీఆర్‌డీఏ శాఖకు మండల వెలుగు సమాఖ్య ఫిర్యాదు చేసింది. దీంతో డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ డీవీఎల్ అన్నపూర్ణ ఆదేశాల మేరకు మండలంలోని రెండు గ్రామాలకు చెందిన యానిమేటర్లకు సోమవారం నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న యానిమేటర్లు మంగళవారం ఉదయం 10 గంటలకు ముమ్మిడివరంలోని డీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఉన్నతాధికారుల ముందు హాజరై సంజాయిషీ ఇచ్చుకోవాలని ఆ నోటీసులో పేర్కొన్నట్లు చెబుతున్నారు.